

మిషన్ భగీరథ పైప్‌లైన్

# షట్‌పల్లి ఎస్సీ కాలనీలో తాగు నీటి తిప్పలు



# దాహం తీరేదెట్లా?

ఆ ఎస్సీ కాలనీవాసులను తాగు నీటి సమస్య వెంటాడుతున్నది. ఇటు బోరు బావి పాడైపోయి.. అటు మిషన్ భగీరథ నీరు రాక పడరాని పాట్లు పడాల్సి వస్తున్నది. నిత్యం పనులన్నీ వదులుకొని స్థానికంగా ఉన్న వ్యవసాయబావి వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది.

- ఆరు నెలల క్రితం పాడైపోయిన బోరు బావి
- పైపులైన్ ఉన్నా అందని మిషన్ భగీరథ నీరు
- పనులన్నీ వదులుకొని వ్యవసాయ బావి వద్దకు పరుగులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- గుక్కెడు నీటికోసం పడరాని పాట్లు పడుతున్న ఎస్సీలు



ఈ ఫొటోలోని దివ్యాంగుడి పేరు మాసు మల్లయ్య. ఇతనిది కోటపల్లి మండలం షట్‌పల్లిలోని ఎస్సీ కాలనీ. నెలల తరబడి తాగు నీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. నిత్యం తన వాకర్ సాయంతో సమీపంలోని వ్యవసాయ పంప్‌సెట్ వద్దకు వెళ్లి తాగు నీరు తెచ్చుకుంటున్నాడు. బోరుబావి పనిచేయక.. మిషన్ భగీరథ నీరు రాక ఈ దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సమస్య పరిష్కరించాలని కాలనీవాసులంతా వేడుకున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడని వాపోతున్నాడు.



వ్యవసాయ బోరు బావి వద్ద నీటిని పట్టుకుంటున్న ఎస్సీ కాలనీ మహిళలు

### నీటికోసం అరిగోస పడుతున్నం



మా కాలనీకి తాగునీరు సరఫరా కావడం లేదు. బోరు బావిని మంచిగ చేసేటోళ్లు లేక ఆరు నెలలుగా అరిగోస పడుతున్నం. మిషన్ భగీరథ పైపులైన్ ఉన్నా నీరు రావడం లేదు. బిందెడు నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తున్నది. వ్యవసాయ బోరు వద్దకు వెళ్లి తాగు నీరు తెచ్చుకుంటున్నం. మహిళలు రోజూ కొట్లాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. మా తిప్పలు పట్టించుకున్నోళ్లు లేరు. **- మాసు లక్ష్మి, షట్‌పల్లి**

### పట్టించుకున్నోళ్లు లేరు



మా ఎస్సీ కాలనీకి మిషన్ భగీరథ పైపులైన్ ఉంది. కానీ మా వరకు నీళ్లు రావడం లేదు. ఇప్పటి దాకా బోరుబావి నీళ్లు తాగినం. అది ఆరు నెలల కింద పాడై పోయింది. అప్పటి నుంచి అవస్థలు పడుతున్నం. అధికారులు పట్టించుకోవడం లేదు. అసలే ఎండా కాలం.. తాగు నీటి కోసం తల్లడిల్లుతున్నం. ఇకనైనా మా గోస తీర్చాలి. **- అగాడి భీమక్క, షట్‌పల్లి**

### అధికారులు దృష్టి పెట్టాలి



మా కాలనీకి తాగు నీరిచ్చేటోళ్లు లేరు. ప్రతి రోజూ మస్తు తిప్పలైతంది. అధికారులు రావడం.. చూసి వెళ్లడం తప్ప చేసిందేమీ లేదు. ఆరు నెలలుగా గిదే గోస. మస్తు తిప్పలైతంది. ఇటు మిషన్ భగీరథ నీళ్లియ్యరు. అటు బోరుబావి మంచిగ చేపించరు. ఇలాగైతే మేమెట్లా బతకడం. **- మాసు రాజక్క, షట్‌పల్లి**

### సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం..

ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు చేసి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా నీటిని అందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, చెన్నూర్**



వ్యవసాయ బోరు బావి వద్ద నీళ్లు తెచ్చుకుంటున్న మహిళలు

కోటపల్లి, మార్చి 16 : కోటపల్లి మండలం షట్‌పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో సుమారు 30 కుటుంబాలు ఉంటాయి. ఈ కాలనీకి తాగు నీరు సరఫరా చేసే బోరు బావి ఆరు నెలల క్రితం పాడై పోయింది. అలాగే మిషన్ భగీరథ పైప్‌లైన్ కూడా పనిచేయకపోవడంతో కాలనీవాసులు సమీపంలో నున్న వ్యవసాయ బోరుబావిపై ఆధారపడాల్సి వస్తున్నది. ఒకే ఒక్క వ్యవసాయ బావి ఉండడం వల్ల పనులన్నీ వదులుకొని అక్కడికి చేరుకొని తాగు నీటి కోసం పోటీ పడుతూ గొడవలు పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అప్పుడప్పుడూ గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీరు తీసుకొస్తుండగా, కాలనీ మొత్తానికి సరిపోవడం లేదని ఎస్సీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండి పడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ముమ్ముందు ఎలాగని వారు ఆందోళన చెందుతున్నారు.

### అందని భగీరథ

ఎస్సీ కాలనీ వరకు మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్నప్పటికీ నీరు సరఫరా కావడం లేదు. అధికారులు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తాగునీరు సరఫరా అవుతుందని అధికారులు చెబుతుండగా, చుక్క నీరు అందడం లేదని కాలనీ వాసులు స్పష్టం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని తాగు నీటి సమస్యకు సత్వరమే పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# పెంచికల్‌పేట్ అడవుల్లో వేట

## నీలుగాయి, దుప్పిని హతమార్చిన వేటగాళ్లు

- రెండు రోజుల్లో రెండు ఘటనలు
- ఏడుగురిపై కేసు నమోదు



చుక్కల దుప్పిని వేటాడి చంపిన నలుగురిని అదుపులోకి తీసుకున్న అటవీ అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని పెంచికల్‌పేట్ అడవుల్లో వన్యప్రాణులకు రక్షణ కరువవుతున్నది. వేటగాళ్లు అటవీ జంతువులను వెంటాడి చంపడం కలకలం రేపుతున్నది. కేవలం రెండు రోజుల వ్యవధిలో రెండు ఘటనలు వెలుగులోకి రాగా, స్థానికంగా చర్చనీయాంశమవుతున్నది. శుక్రవారం పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడ వద్ద అధికారులు తనిఖీ చేస్తుండగా, బైక్‌లపై వస్తున్న పెంచికల్‌పేట్‌కు చెందిన అప్పాజి, అప్పాజి వెంకటేశ్, మేకల రమేశ్, ఒడ్డుగూడెంకు చెందిన బింకరి తిరుపతిని ఆపి పరిశీలించారు. వారి వద్ద రెండు గొడ్డళ్లు లభించాయి. వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా, బొక్కివాగు సమీపంలోని అగర్‌గూడ అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి ఒక నీలుగాయిని చంపి వండుకొని తిన్నట్లు ఒప్పుకున్నారు. ఈ ఘటనపై అటవీ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇందులో మరి కొంత మంది పాల్గొని ఉంటారని అటవీ అధికారులు భావిస్తున్నారు. ఇక శనివారం రాత్రి లోడ్‌పల్లి శివారు.. కొత్తవాడ సమీపంలోని అటవీ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అటవీ అధికారులకు అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు ఎదురుపడ్డారు. వారిని తనిఖీ చేయగా మాంసంతో కూడిన సంచులు లభించాయి. నిందితులు పరారవుతుండగా, అటవీ అధికారులు వారిని వెంబడించి పట్టుకొని విచారణ చేపట్టారు. చుక్కల దుంపిని చంపినట్లు వారు ఒప్పుకున్నట్లు తెలిసింది. వారి వద్ద నుంచి చుక్కల దుప్పి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో గొర్ల శేఖర్, బొల్లబోయిన గంగయ్య, ఆత్రం శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఎస్‌వో వేణుగోపాల్ తెలిపారు.

### రక్షణ కరువు

కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో యేటేటా పులుల సంచారం పెరుగుతోంది. పులులను సంరక్షించేందుకు అటవీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. పులులతో పాటు వన్యప్రాణాలకు హాని కలిగించవద్దని అటవీ గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే, పులులకు కావాల్సిన ఆహారంగా శాఖాహార జంతువుల సంతతిని పెంచేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నప్పటికీ వేటగాళ్ల బారి నుంచి మాత్రం వాటిని కాపాడలేకపోతున్నారన్న ఆరోపణలున్నాయి.



హతమార్చిన దుప్పితో నిందితుడు (ఫైల్)

# సర్వే పారితోషికం ఇంకెప్పుడు..?

## కులగణన సిబ్బందికి అందని డబ్బులు

- ఐదు నెలలుగా ఎదురుచూపులు
- నిధులు విడుదల చేయని సర్కారు



కులగణన నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్(ఫైల్)

దండేపల్లి, మార్చి 16 : బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం రాష్ట్ర ప్రభుత్వం నవంబర్‌లో కులగణన సర్వే(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే) చేపట్టింది. ఈ సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు పారితోషికం ఇవ్వకుండా సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా కులగణన సర్వేలో మొత్తం 2181 మంది ఎన్యూమరేటర్లు, 224 మంది సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ సర్కారు కులగణన సర్వే చేపట్టింది. గతేడాది నవంబర్ 9 నుంచి 24వ తేదీ వరకు సర్వే నిర్వహించారు. ఇందుకోసం మున్సిపాలిటీల పరిధిలో అధికారులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, గ్రామ పంచాయతీల్లో జీపీ కార్యదర్శులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఎంఆర్‌సీ సిబ్బందిని ఎన్యుమరేటర్లుగా నియమించింది. వీరంతా ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ప్రతి కుటుంబం వివరాలు సేకరించారు. 75 ప్రశ్నలున్న ధ్రువపత్రాల ద్వారా సమాచారం సేకరించారు. సర్వే క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించేందుకు మండల అధికారులను సూపర్‌వైజర్లుగా నియమించారు. ఎన్యుమరేటర్లు చేసిన సర్వేను పర్యవేక్షిస్తూ కుటుంబాల వివరాలు నమోదు చేసిన ధ్రువపత్రాలను తనిఖీ చేసి రోజు వారీగా ఉన్నతాధికారులకు నివేదించారు. అలాగే సర్వే వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించింది.



నెల్కివెంకటాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

### ఇదీ పరిస్థితి...

సమగ్ర సర్వే చేసిన వారికి రూ.2,44,98,000 రావాల్సి ఉంది. వీటితో పాటుగా డాటా ఎంట్రీ చేసినందుకు రూ.73,92,714 రావాల్సి ఉంది. సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్లకు రూ.10 వేలు, సూపర్‌వైజర్లకు రూ.12వేలు, వెబ్‌సైట్‌లో కుటుంబ వివరాలు నమోదు చేసిన డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో ఫారం నమోదు చేసినందుకు సుమారు రూ.25 చెల్లించాలని నిర్ణయించింది. సర్వే పూర్తయి ఐదు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం పారితోషికం చెల్లించడం లేదని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదించగా నిధుల లేమి కారణంగా ఆలస్యమవుతుందని, త్వరలోనే వారి సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

## కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలి

శ్రీరాంపూర్, మార్చి 16 : సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ పద్ధతిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేయడం దుర్మార్గమని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడారు. సింగరేణిలో అత్యంత కీలకమైన సెక్యూరిటీ, వైద్య శాఖలకు ఉన్నతాధికారులుగా సింగరేణి ఉద్యోగులై ఉంటేనే బాగుంటుందన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో నియమిస్తే అక్రమాలకు పాల్పడే ఆస్కారముంటుందని, ఆ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండి రమేశ్, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేశ్, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్నీ తామై.. ఆశీర్వదించి..

## దివ్యాంగ జంటకు వివాహం జరిపించిన బస్తీవాసులు



బస్తీప్రజల సమక్షంలో దివ్యాంగుల వివాహం

బెల్లంపల్లి, మార్చి 16 : ఆ బస్తీవాసులంతా అన్నీ తామై ఓ దివ్యాంగ జంటకు అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. నిండూ నూరేళ్లు చల్లగా ఉండాలని.. సుఖసంతోషాలతో జీవించాలని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. బెల్లంపల్లి పట్టణంలోని బూడిదగడ్డ బస్తీ(22వ వార్డు)కి చెందిన తమ్మిడి భాగ్యమ్మ-సత్తయ్య కూతురు ప్రేమలతకు చిన్నతనంలోనే పోలియోతో రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. పెద్దపల్లి జిల్లా ఆదివారంపేటకు చెందిన కన్నూరి రాయమల్లమ్మ-ఓదెలు రెండో కుమారుడు రమేశ్ దివ్యాంగుడు(అంధుడు). పెద్దల ద్వారా వీరి పెళ్లి కుదిరింది. ఇరువురు నిరుపేదలు కావడంతో బూడిదగడ్డ బస్తీవాసులంతా కలిసి వీరిద్దరికీ వివాహం చేయాలని నిశ్చయించారు. ఇంకేముంది అన్నీ తామై ఆదివారం బెల్లంపల్లి మండల శివారులోని శివాలయంలో వివాహం జరిపించారు. అందరూ కలిసి పుస్తెలు, మట్టెలు.. తదితర సామగ్రి కొని అంగరంగ వైభవంగా పెళ్లి తంతు ముగించారు. అతిథులందరికీ భోజనం పెట్టారు. మాజీ కౌన్సిలర్లు బడికెల రమేశ్, గోసిక రమేశ్, గడ్డం అశోక్‌గౌడ్, టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుడు సిరిశెట్టి సత్యనారాయణ, దాసరి దుర్గ రాజేశ్, సుంకరి వెంకటేశ్ ఉన్నారు.



గోలేటి సీఈఆర్ క్లబ్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విశ్వనాథ మహర్షి

## గోలేటి సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం

రెబ్బెన, మార్చి 16: ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని డాక్టర్ విశ్వనాథ మహర్షి అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా, మాతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్యం ద్వారా మోకాళ్లు, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్, పక్షవాతం, అజీర్ణం, మలబద్ధకం, ఆస్తమావంటివి నయం చేయొచ్చని తెలిపారు. ప్రతి నెలా 16న గోలేటి సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించే ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.